సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 23 । ఫిబ్రవరి । 2023



హనుమద్ కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రంలో బుధవారం సువర్చలా సమేత ఆంజనేయస్వామి కల్యాణాన్ని నేత్రపర్వంగా జరిపించారు.



ఉయ్యాలవాడకు నివాళి

తాడేపల్లిగూడెం: పోరాట యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిని వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన వర్సిటీలో నిర్వహించారు.



నిత్యాన్నదానానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు భోగరాజు బ్రహ్మాజీరావు (పూనె) బుధవారం రూ.50,001ను విరాళంగా అందజేశారు.

అట్టహాసంగా నామినేషన్ల దాఖలు

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా కవురు, వంకా నామినేషన్ల సమర్పణ
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- ఎమ్మెల్సీ స్థానాల్లో బడుగులకే పెద్దపీట
- నేటితో ముగియనున్న నామినేషన్ల స్వీకరణ





నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు వంకా రవీంద్ర, కవురు శ్రీనివాస్, చిత్రాల్లో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు శ్రీరంగనాథరాజు, అబ్బయ్యచౌదరి, వెంకట్రావు

సాక్షిప్రతినిధి, ఏలూరు: స్థానిక సంస్థల కోటాలో శాసనమండలి సభ్యుల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ కీలక ఘట్టానికి చేరుకుంది. గురువారంతో నామినేషన్ల స్వీకరణ ముగియనుండటంతో బుధవారం అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అట్టహాసంగా ప్రజాప్రతినిధులతో కలిసి వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. ఇప్పటివరకు మొత్తం 4 నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ మండలి అభ్యర్థులుగా జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, తణుకుకు చెందిన పారిశ్రామికవేత్త వంకా రవీంద్రనాథ్ పేర్లను ప్రకటించిన క్రమంలో వీరిద్దరూ బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. తెలుగుదేశం పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ వీరవల్లి చంద్రశేఖర్ నామినేషన్ దాఖలు చేశారు.

ఎన్నిక లాంఛనమే..

సామాజిక సమీకరణాలకు పెద్దపీట వేస్తూ జిల్లాలో కీలకంగా ఉన్న బీసీలు, కాపులను శాసనమండలి అభ్యర్థులుగా అధికార వైఎస్సార్ సీపీ ప్రకటించింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 85 శాతానికి పైగా స్థానిక సంస్థలు వైఎస్సార్ సీపీ కైవసం చేసుకుంది. ఈ క్రమంలో పార్టీ ప్రకటించిన ఇద్దరు అభ్యర్థుల ఎన్నిక లాంఛనం కానుంది. అయితే బరిలో ప్రస్తుతానికి స్వతంత్ర అభ్యర్థిగా నల్లి రాజేష్‌కుమార్, టీడీపీ అభ్యర్థిగా వీరవల్లి చంద్రశేఖర్ నామినేషన్లు దాఖలు చేశారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నామినేషన్ల ప్రక్రియ ముగియనుంది.

కోలాహలంగా.. వైఎస్సార్ సీపీ అభ్యర్థులు కోలాహలంగా ఏలూరు కలెక్టరేట్ కార్యాలయానికి చేరుకుని నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబుకు సమర్పించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, దెందులూరు, గోపాలపురం, అవనిగడ్డ ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, తలారి వెంకట్రావు, సింహాద్రి రమేష్‌బాబు, తణుకు, పాలకొల్లు నియోజకవర్గాలకు చెందిన పార్టీ నేతలు హాజరయ్యారు.

బీసీలకు అధిక ప్రాధాన్యం: మంత్రి కారుమూరి

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేబినెట్‌లో, శాసనమండలిలో, నామినేట్ పదవుల్లోనూ బీసీలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. గత పాలకులు పూర్తిగా రాజకీయాలను నిర్లక్ష్యం చేశారని, బీసీ కులాలన్నింటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి న్యాయం చేస్తున్నారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా మన రాష్ట్రంలో బీసీ సంక్షేమానికి పెద్దపీట వేశారని చెప్పారు.

బడుగుల కల సాకారం

ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మాట్లాడుతూ బడుగుల కలలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేశారని, 18 శాసనమండలి స్థానాల్లో 11 మంది బీసీలకు అవకాశం కల్పించారని, అలాగే కేబినెట్‌లోనూ, మండలిలోనూ దళితులకు అధిక ప్రాధాన్యమిచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో 30 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉంటారన్నారు.

వెనుకబడిన వర్గాలకు వెన్నుదన్ను

ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు వైఎస్సార్‌సీపీ వెన్నుదన్నుగా ఉందని, ప్రజల దృష్టిలో టీడీపీ ఎప్పుడో చచ్చిపోయిందని, ఎల్లో మీడియా దృష్టిలోనే బతికి ఉందన్నారు.



నామినేషన్ కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ కార్యకర్తలు

పార్టీలో కష్టపడిన వారికి సముచిత స్థానం

2014 ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసి ఓడిపోయాను. 2019లో ఎంఎస్ఎంఈ చైర్మన్‌గా నన్ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నియమించారు. రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి చేశాను. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి, నిబద్ధతతో ఉన్నవారికి సముచిత స్థానం దక్కుతుంది.

– వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్సీ అభ్యర్థి

పాలకొల్లులో పాగా వేస్తాం

పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయనుంది. ఎన్టీఆర్, వైఎస్సార్‌లాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అండగా ఉన్నారు. మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు.

– కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ అభ్యర్థి

వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, పార్టీ ఎల్లవేళలా వారికి అండగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్టు పార్టీ అనుబంధ విభాగాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తెలిపారు. బాధ్యతలు స్వీకరించనున్న నాయకులకు ఆయన అభినందనలు తెలిపారు.

పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షులు

- యువజన విభాగం: కుంచినపల్లి విన్సన్‌బాబు (పాలకొల్లు)
- మహిళా విభాగం: గూడూరి ఉమాబాల (భీమవరం)
- రైతు విభాగం: బోడపాటి వీర్రాజు (తణుకు)
- బీసీ సెల్: పాల సత్యనారాయణ (తణుకు)
- ఎస్సీ సెల్: కొల్లాబత్తుల రవికుమార్ (నరసాపురం)
- ఎస్టీ సెల్: కావడి శివకుమార్ (తాడేపల్లిగూడెం)
- మైనార్టీ సెల్: ఎండీ జహంగీర్ (ఉండి)
- స్టూడెంట్ వింగ్: చిన్నం సురేష్ (తాడేపల్లిగూడెం)
- వైఎస్సార్‌టీయూసీ: మారోజు వెంకట గణేష్ (భీమవరం)
- వాణిజ్య విభాగం: బలభద్రబాల రెడ్డయ్య (పాలకొల్లు)
- సాంస్కృతిక విభాగం: పోకల వెంకటేశ్వర్లు (పాలకొల్లు)
- వైఎస్సార్ సేవాదళ్: బలే యేసుబాబు (భీమవరం)
- ప్రచార విభాగం: పెన్మెత్స రామరాజు (తణుకు)
- క్రిస్టియన్ మైనార్టీ సెల్: రాజా బాబు (తాడేపల్లిగూడెం)
- పంచాయతీరాజ్ వింగ్: తన్నేడి వెంకట గంగాధర్‌రావు (నరసాపురం)
- గ్రీవెన్సెస్ సెల్: కరిమెరక రామచంద్రరావు (ఉండి)
- వీవర్స్ వింగ్: అందే నాగబసవన్న (ఆచంట)
- డాక్టర్స్ వింగ్: దాట్ల సుందర రామరాజు (తణుకు)
- ఐటీ వింగ్: బుడితి సుమన్‌కుమార్ (నరసాపురం)
- వికలాంగుల విభాగం: కేసిరెడ్డి దిలీప్ రామ (ఉండి)

విద్యార్థులు సాంకేతిక సారథులు



ఉల్కాన్‌జీ వేడుకల్లో పాల్గొన్న ప్రమోద్ పడోలే

తాడేపల్లిగూడెం: విద్యార్థులు సాంకేతిక సారథులని ఏపీనిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎం.ప్రమోద్ పడోలే అన్నారు. బుధవారం రాత్రి నిట్‌లో జరిగిన ఉల్కాన్‌జీ వేడుకల్లో భాగంగా టెక్నో, కల్చరల్ ఫెస్టివల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత లక్ష్యాలు శ్రమతోనే సుసాధ్యమవుతాయన్నారు. లక్ష్యం చేరేవరకు విద్యార్థులు కఠోర సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్, ఐఓటీ వంటి అత్యాధునిక పరిజ్ఞానంతో కూడిన మరిన్ని ఆధారిత ఉత్పత్తులను తీసుకురావడానికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలు దేశ అభ్యున్నతికి వెన్నెముకగా నిలుస్తాయన్నారు. నూతనంగా నిర్మించిన పరిపాలనా భవనాన్ని పడోలే ప్రారంభించారు. డీన్‌లు శాస్త్రి, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల సంక్షేమానికి కృషి

కలెక్టర్ ప్రశాంతి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్) : వలస కార్మికుల ప్రయోజనాలను కాపాడేందుకు కార్మిక శాఖ అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఆమె అధికారులతో సమీక్షించారు. ఒడిసా, పశ్చిమబెంగాల్, బిహార్ ప్రాంతాల నుంచి ఎక్కువమంది జిల్లాకు వచ్చి చేపల చెరువులు, ఆక్వా పరిశ్రమలు తదితర ప్రదేశాల్లో పనిచేస్తున్నారన్నారు. వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నైపుణ్యం గల భవన నిర్మాణ కార్మికులను గుర్తించి జగనన్న లేఅవుట్లలో పనికి వినియోగించాలని, ప్రతి మండలానికి సుమారు 25 మంది జాబితాను హౌసింగ్ అధికారులకు అందించాలని ఆదేశించారు.

పట్టణ సుందరీకరణపై..

పట్టణ సుందరీకరణలో మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక గుర్తింపుగా నిలవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ కమిషనర్లతో ఆమె సమావేశమై పట్టణ అభివృద్ధి, గ్రీనరీ పనులపై సమీక్షించారు. పట్టణాల్లో మొక్కల పెంపకం, పచ్చదనం పెంపొందించేందుకు కృషి చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో సాధారణ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులను వచ్చేనెలాఖరులోపు పూర్తిచేయాలన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై..

చనిపోయిన, వలస వెళ్లిన, 60 ఏళ్లు పైబడిన వారి స్థానాల్లో అర్హులైన వారి కుటుంబసభ్యులకు నిబంధనల మేరకు టిడ్కో గృహాలను అందజేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. 75 శాతం రుణం మంజూరు చేసిన గృహాలకు మిగిలిన రుణం కూడా మంజూరు చేసేలా బ్యాంకర్లకు సూచించాలని ఆదేశించారు.

బియ్యం సేకరణ వేగవంతం

జిల్లాలో బియ్యం సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పౌరసరఫరాలు, ఎఫ్‌సీఐ, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై జిల్లాలోని ధాన్యం కొనుగోళ్లపై ఆమె సమీక్షించారు. జిల్లాలో 3.76 టన్నుల ధాన్యం సేకరించామని, దానిలో 67 శాతం మేరకు బియ్యం 2.53 టన్నులు కొనుగోలు చేయాల్సి ఉందన్నారు. ఇప్పటివరకూ 2 లక్షల టన్నుల బియ్యం సేకరించామని, మిగిలిన బియ్యాన్ని వచ్చేనెల 15వ తేదీలోపు సేకరించాలన్నారు. ఇన్‌చార్జి జేసీ ఎం.సూర్యతేజ, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

త్రోబాల్‌లో జయకేతనం



జాతీయస్థాయి పోటీల్లో సత్తాచాటిన జిల్లా బాలికల జట్టు

తాడేపల్లిగూడెం: కేరళలోని ఎర్నాకుళంలో జరిగిన త్రోబాల్ పోటీల్లో జిల్లా త్రోబాల్ బాలురు, బాలికల జట్లు సత్తాచాటాయని అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ఎఆర్‌కే వర్మ బుధవారం ఇక్కడ తెలిపారు. ఈనెల 18,19 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి అండర్–19 త్రోబాల్ పోటీల్లో జిల్లా జట్లు తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. అలాగే కేరళలోనే జరిగిన 15వ సౌత్‌జోన్ జాతీయస్థాయి త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పురుషుల జట్టు ద్వితీయ, మహిళల జట్టు తృతీయ స్థానంలో నిలిచాయన్నారు. జిల్లా నుంచి వెళ్లిన జట్టులో తొమ్మిది మంది క్రీడాకారులు ప్రతిభ కనబర్చారన్నారు. జిల్లా త్రోబాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎస్ఎం శ్రీనాథ్ క్రీడాకారులను అభినందించారు.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా బుధవారం జరిగిన ఇంటర్ ప్రయోగ పరీక్షలకు 2,342 మంది విద్యార్థులకు 2,077 మంది హాజరయ్యారు. 25 కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షకు 1,202 మందికి గాను 1,030 మంది, మధ్యాహ్నం 1,140 మందికి 1,047 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర బాబు తెలిపారు.

వాహన పన్ను వసూలు వేగవంతం

- రవాణా శాఖకు ఆదాయం
- 80 శాతం మేర వసూలు
- జిల్లా ముందంజ



వాహన పత్రాలను పరిశీలిస్తున్న రవాణా శాఖ అధికారి రవికుమార్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లా రవాణా శాఖ పన్నుల వసూళ్లలో దూసుకుపోతోంది. వాణిజ్య వాహనాల త్రైమాసిక పన్నుకు సంబంధించి గతేడాది డిసెంబర్ 31 నుంచి ఇప్పటివరకూ 80 శాతం మేర పన్ను వసూలు చేసింది. జిల్లావ్యాప్తంగా 831 వాహనాలకు గాను ఇప్పటివరకూ 716 వాహన యజమానుల నుంచి రూ 59.19 లక్షలు వసూలు చేశారు. మరో 115 వాహనాల నుంచి పన్ను వసూలు చేయాల్సి ఉంది. వచ్చేనెలాఖరు నాటికి నూరు శాతం వసూలు లక్ష్యంగా అధికారులు పనిచేస్తున్నారు.

నాలుగు కార్యాలయాల ద్వారా..

జిల్లాలో భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెంలో రవాణా శాఖ కార్యాలయాలు ఉన్నాయి. ఐదుగురు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు అసిస్టెంట్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పనిచేస్తున్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు ఆదేశాలతో అధికారులు బృందాలుగా ఏర్పడి పన్ను వసూలు చేయడంతో పాటు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. పన్ను కట్టకుండా తిరుగుతున్న వాహనాలపై చర్యలు తీసుకుంటున్నారు. గత త్రైమాసికంలో పన్ను చెల్లించకుండా తిరుగుతున్న 80 వాహనాలను సీజ్ చేశారు.

పన్ను వసూలు ఇలా..

కార్యాలయం	వాహనాల సంఖ్య	మొత్తం (రూ.లలో)
భీమవరం	404	37,25,440
పాలకొల్లు	174	8,30,370
తాడేపల్లిగూడెం	72	8,65,200
తణుకు	66	4,98,705

గడువులోపు చెల్లించాలి



గతేడాది డిసెంబర్ 31 త్రైమాసిక పన్నుకు సంబంధించి జిల్లాలో 80 శాతం మేరకు వసూలు చేశాం. వేగంగా పన్ను వసూళ్లకు చర్యలు తీసుకున్నాం. స్పందన బాగుంది. ట్యాక్స్ చెల్లించాల్సిన వాహనదారులు బాధ్యతగా ముందుకు వచ్చి పన్ను చెల్లిస్తున్నారు. 716 వాహనాలకు పన్ను చెల్లించారు. మిగిలిన వాహనాల యాజమానులు పెండింగ్ ట్యాక్స్‌లను గడువులోగా చెల్లించాలి. తనిఖీల్లో పట్టుబడితే అపరాధ రుసుంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తాం. రహదారులపై తిప్పని వాహనాల వివరాలను వచ్చేనెల 31లోపు సమీపంలోని రవాణా కార్యాలయాల్లో అందజేయాలి. వాటిని స్క్రాప్‌గా పరిగణించి పెండింగ్ ఉన్న జాబితా నుంచి తొలగిస్తాం.

–టి.మహేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి, భీమవరం

న్యూస్‌రీల్

లేగదూడల అందాల పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: వీరవాసరం మండలం మత్స్యపురిలో బుధవారం జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన, అందాల పోటీలు నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధశాఖాధికారి డాక్టర్ కె.మురళీకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై లేగదూడల పెంపకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధుల నివారణ, ప్రత్యేక దాణాపై వివరించారు. మురాల చిననర్సింహరావు, గోడి సంజీవరెడ్డి, పినిశెట్టి సుబ్రహ్మణ్యం లేగ దూడలు మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ జేసురత్నం, డివిజన్ అధికారి జాఫర్‌హుస్సేన్, భీమవరం ప్రాంతీయ పశువైద్యశాఖ సహాయ సంచాలకుడు పి.సుధీర్‌బాబు, మండల పశువైద్యాధికారి పి.లలితకుమార్ పాల్గొన్నారు.

యూత్ క్లబ్‌ల ఏర్పాటుకు చర్యలు



మాట్లాడుతున్న సెట్‌వెల్ సీఈఓ

చింతలపూడి: గ్రామీణ యువతకు అవసరమైన కార్యక్రమాల కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా సెట్‌వెల్ సీఈఓ ఎండీ హెచ్ మెహరాజ్ తెలిపారు. స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో బుధవారం యూత్ క్లబ్స్ ఫార్మేషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో 10 నుంచి 15 మంది యువతీ, యువకులతో యూత్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. వారి వయసు 18 నుంచి 35 ఏళ్లలోపు ఉండాలన్నారు. చదువుతో సంబంధం లేకుండా యువతను ఎంపిక చేయాలన్నారు. సెట్‌వెల్ ద్వారా జాబ్‌మేళాలు, శిక్షణా తరగతులు, స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఎంపీడీఓ మణికుమారి, సెట్‌వెల్ ఏఓ, పంచాయతీ విస్తరణ అధికారి పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్య శిక్షణ



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక సత్రంపాడు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో వివిధ కోర్సుల్లో 3 నెలల స్వల్పకాలిక శిక్షణా కార్యక్రమం నిమిత్తం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రధానాధికారి పి.రజిత ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్– హోమ్ అప్లయెన్సెస్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్, ఎలక్ట్రిక్ వెహికల్ అసెంబ్లీ టెక్నీషియన్, సోలార్ లైటింగ్ అసెంబ్లీర్ (ఎలక్టివ్ హోమ్ లైటింగ్ సిస్టమ్/ స్ట్రీట్ లైట్స్) కోర్సుల్లో శిక్షణ ఇస్తామని, 10వ తరగతి ఆ పైన విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వయసు 15 నుంచి 45 ఏళ్లు ఉండవచ్చని తెలిపారు. అభ్యర్థులు తమ విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతో ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

పెద్దింట్లమ్మకు పంచహారతులు



అమ్మవారికి హారతులు ఇస్తున్న దృశ్యం

కైకలూరు: కొల్లేటికోటలోని పెద్దింట్లమ్మ జాతర బుధవారం రెండో రోజుకు చేరింది. ఉదయం జలదుర్గ సమేత పెద్దింటి అమ్మవారికి సుగంధ ద్రవ్యాభిషేకం, పంచఫల రసాభిషేకం, గంగోధక అభిషేకం, నూతన వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ తదితర కార్యక్రమాలు జరిగాయి. వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని వైఎస్సార్‌సీపీ నేత సయ్యపురాజు గుర్రాజు (భుజబలపట్నం) అందించారు. కట్టా లక్ష్మీ రత్నకుమారి భగవద్గీత పారాయణ ప్రవచనం, మట్టా శ్రీరాములు అధ్వర్యంలో శివరంజని నాట్యమండలి సత్య హరిశ్చంద్ర నాటక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆలయ ఈఓ కేవీ గోపాలరావు మాట్లాడుతూ జాతర 15 రోజుల పాటు సాయంత్రం 6 గంటల నుంచి అమ్మవారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. 3న జలదుర్గా, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తామన్నారు.

ఎస్‌పీఎల్ రీజనల్ విజేతలు సీఆర్‌ఆర్, ఎన్ఆర్ఐ

- ముగిసిన రీజనల్ క్రికెట్ పోటీలు
- సీనియర్ విభాగంలో సర్ సీఆర్‌ఆర్
- జూనియర్ విభాగంలో ఎన్ఆర్ఐ గెలుపు
- నేటి నుంచి విజ్ఞాన్స్‌లో రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు



రిజిస్ట్రార్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా గౌరిశంకర్, సాక్షి బీఎం గోపి నుంచి ట్రోఫీని అందుకుంటున్న సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల జట్టు



జూనియర్ విభాగంలో రన్నర్ ట్రోఫీని అందుకుంటున్న ఏలూరు సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కళాశాల జట్టు

చేబ్రోలు: సాక్షి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) రీజనల్ స్థాయి జూనియర్స్, సీనియర్ స్థాయి పురుషల క్రికెట్ పోటీలు గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో బుధవారం ఉత్కంఠభరితంగా ముగిశాయి. రెండో రోజు నిర్వహించిన మూడు మ్యాచ్‌లలో ఆరు జట్లు మధ్యపోరు హోరాహోరీగా సాగాయి. రీజనల్ స్థాయి విజేతల బహుమతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ మీడియా ఎ.గౌరిశంకర్ రావు, గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజ్ఞాన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ మాట్లాడుతూ క్రీడాకారులు మాత్రమే వరల్డ్ చాంపియన్స్ అవ్వగలరని, క్రీడల్లో రాణింపుతోనూ ఉన్నత స్థానాలకు చేరుకో వచ్చున్నారు. శారీరక శ్రమ కలిగే విధంగా ఆటలు ఆడటం వలన విద్యార్థులకు ఆరోగ్యం లభిస్తుందన్నారు. క్రీడల ద్వారా ఎంతోమంది ఉన్నత స్థానాలకు వెళ్లి దేశ ప్రతిష్టను పెంచారని గుర్తు చేశారు. మానసిక ఉల్లాసం కోసం వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఫిట్‌నెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మ్యాచ్‌లను గుంటూరు జిల్లా సాక్షి బ్రాంచి మేనేజర్ టీ గోపీ పర్యవేక్షించారు.

నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి విజయదుందుభి

రీజనల్ మ్యాచ్ జూనియర్స్ విభాగంలో నిర్వహించిన నాకౌట్ మ్యాచ్‌లో సర్ సీఆర్ రెడ్డి (ఏలూరు) కాలేజీ విజయదుందుభి మోగించింది. మొదట టాస్ గెలిచి సర్ సీఆర్ రెడ్డి టీమ్ బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కల్లం హరనాథరెడ్డి (గుంటూరు) కాలేజీ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 63 పరుగులు చేసింది. బ్యాట్స్‌మెన్ నందు 21 పరుగులు (2 ఫోర్లు, 1 సిక్స్)తో రాణించాడు. సర్ సీఆర్ రెడ్డి కాలేజీ బౌలర్ కే గణేష్ 3 వికెట్లతో మెరిశాడు. అనంతరం 64 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి కాలేజీ కేవలం 5 ఓవర్లలో 1 వికెట్ మాత్రమే కోల్పోయి 64 పరుగులు చేసి 9 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. సర్‌సీఆర్ రెడ్డి కాలేజీ బ్యాట్స్‌మెన్ ఎస్‌కే సాయి చరణ్ 36 పరుగులు (4 ఫోర్లు, 2 సిక్స్‌లు)తో మెరిపించి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

అలవోకగా నెగ్గిన సర్ సీఆర్‌రెడ్డి జట్టు

సాక్షి ప్రీమియర్ లీగ్ సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ(ఏలూరు) రీజనల్ విజేతగా నిలిచింది. రన్నర్‌గా ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ (నెల్లూరు) నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న సర్ సీఆర్ రెడ్డి కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసింది. సర్ సీఆర్ రెడ్డి టీమ్‌లో నాగవెంకట తేజ 32 (3 ఫోర్లు) పరుగులతో రాణించారు. ఎన్‌బీకేఆర్‌ఐఎస్‌టీ బౌలర్లలో మనోజ్, అమర్‌నాథ్ చెరో రెండు వికెట్లతో రాణించారు. అనంతరం 96 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన ఎన్‌బీకేఆర్ ఐఎస్‌టీ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 43 పరుగులు మాత్రమే చేసి 52 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి కళాశాల బౌలర్లు హేమంత్, ఉమేష్, మధు ఒక్కొక్కరు రెండు వికెట్లతో రాణించారు. 32 పరుగులు చేసిన నాగవెంకట తేజ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా ఎంపికయ్యాడు.

జూనియర్స్ రీజనల్ విజేత ఎన్ఆర్ఐ

సాక్షి ప్రీమియర్ లీగ్ జూనియర్స్ విభాగంలో ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ(విజయవాడ) విజేతగా నిలిచింది. రన్నర్‌గా సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ (ఏలూరు) రన్నర్‌గా నిలిచింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ నిర్ణీత 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ 53 పరుగులతో (5 ఫోర్లు, 1 సిక్స్) దుమ్మురేపాడు. అనంతరం 94 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 72 పరుగులు మాత్రమే చేసి 21 పరుగుల తేడాతో ఓటమి చెందింది. సర్ సీఆర్ రెడ్డి పాలిటెక్నిక్ కాలేజ్ బ్యాట్స్‌మెన్, కెప్టెన్ కే సాయి చరణ్ 18 పరుగులు (2 ఫోర్లు) మాత్రమే రాణించాడు. ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ నలుగురు బౌలర్లు జాఫర్, ప్రకాష్, తేజదీప్, రేవంత్ తలో 2 వికెట్లు తీసి సమష్టి కృషితో విజయంలో కీలకపాత్ర పోషించారు. బ్యాటింగ్‌లో 53 పరుగులు, బౌలింగ్‌లో 2 వికెట్లు తీసి ఆల్‌రౌండ్ ప్రతిభ కనపరిచిన ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ బ్యాట్స్‌మెన్ కే రేవంత్ మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి మ్యాచ్‌లు

- సీనియర్స్ విభాగంలో సీకామ్ డీగ్రీ కాలేజ్ (తిరుపతి) వర్సస్ ఎంవీజీఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (విజయనగరం)
- జూనియర్స్ విభాగంలో సాయి గణపతి కాలేజ్ (విశాఖపట్నం) వర్సస్ ఎన్ఆర్ఐ జూనియర్ కాలేజీ (విజయవాడ)
- సీనియర్స్ విభాగంలో సర్ సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ (ఏలూరు) వర్సస్ సీకామ్ డిగ్రీ కాలేజ్ (తిరుపతి)

క్లుప్తంగా

బాలిక వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

యలమంచిలి: మేడపాడులో బాలికకు పెళ్లి చేస్తున్నారనే సమాచారంపై బుధవారం అధికారులు వెళ్లి పెళ్లిని అడ్డుకున్నారు. మైనర్లకు పెళ్లి చేయడం నేరమని, ఆ విధంగా చేస్తే చట్ట ప్రకారం శిక్షార్హులు అవుతారని హెచ్చరించారు. బాలిక తల్లిదండ్రులు, బంధువులకు కౌన్సెలింగ్ ఇచ్చి మేజర్ అయ్యేవరకు పెళ్లి చేయమని పత్రాలు రాయించారు. గ్రామ కార్యదర్శి మన్నే మాధురి, వీఆర్వో తోట శ్రీనివాసరావు, ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ సూపర్‌వైజర్ యాడేపల్లి మహాలక్ష్మి, హెచ్‌సీ కృష్ణారావు, సోషల్ వెల్ఫేర్ అసిస్టెంట్ గురుజు శైలజ, మహిళ పోలీస్ పోతుల జయ భాను లక్ష్మి ఉన్నారు.

జుత్తిగలో బాల్యవివాహంపై విచారణ

పెనుమంట్ర: జుత్తిగలో ఈనెల 10న శ్రీసోమేశ్వరస్వామి ఆలయ సమీపంలో బాల్యవివాహం జరిగిందని వచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు విచారణ చేశారు. ముందుగా సోమేశ్వర స్వామి ఆలయ అర్చకులను, అంగన్‌వాడీ కార్యకర్తలను పంచాయతీ కార్యదర్శులను ఆలయ ఆవరణకు పిలిచి, విచారించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులను కూడా వారి ఇంటి వద్దకు వెళ్లి విచారణ నిర్వహించినట్లు పెనుమంట్ర ఐసీడీఎస్ సీడీపీఓ కె.మేరీఎలిజబెత్ చెప్పారు. బాలిక తాత షష్టి పూర్తి కార్యక్రమమే జరిగిందని, ఎటువంటి వివాహం తమ ఇంట్లో జరగలేదని బాలిక తల్లిదండ్రులు విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. విచారణలో ఎంపీడీఓ పూర్ణ బాబ్జి, ఆర్ఐ వై.అప్పారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.వెంకటలక్ష్మి, గ్రామ కార్యదర్శి పిల్లి ముసలయ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకులపై గొడ్డళ్లతో దాడి

- పాతకక్షల నేపథ్యంలో మండపాకలో ఘటన
- పోలీసుల అదుపులో ఆరుగురు నిందితులు





తీవ్ర గాయాలపాలైన మానేపల్లి శ్యాంబాబు, తణుకులో చికిత్స పొందుతున్న పవన్



ఘర్షణలో రక్తసిక్తమైన స్కూటీ

తణుకు: పాతకక్షల నేపథ్యంలో తండ్రీకొడుకులపై ఓ కుటుంబం గొడ్డళ్లు, కత్తులతో హత్యాయత్నానికి పాల్పడింది. తణుకు మండలం మండపాక గ్రామంలో బుధవారం జరిగిన ఈ ఘటనలో తండ్రి మానేపల్లి శ్యాంబాబు, కొడుకు మానేపల్లి పవన్‌లకు తీవ్రగాయాలయ్యాయి. శ్యాంబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండపాక మడుగుగట్టు ప్రాంతంలో నివాసం ఉంటున్న మానేపల్లి శ్యాంబాబు కుమార్తెను పొరుగింట్లో నివాసం ఉంటున్న కంకిపాటి చంద్రశేఖర్ గత కొద్ది రోజులుగా వెంటపడి వేధిస్తున్నాడు. ఈక్రమంలో గతంలో పెద్దల సమక్షంలో చంద్రశేఖర్‌ను యువతి కుటుంబ సభ్యులు హెచ్చరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కంకిపాటి చంద్రశేఖర్, తండ్రి సుధాకర్, సోదరుడు జయకర్ మరో ముగ్గురితో కలిసి బుధవారం ఉదయం మోటారు సైకిల్‌పై వెళుతున్న పవన్‌ను అడ్డగించి గొడ్డలి, కత్తులతో దాడి చేశారు. ఈ సమయంలో పవన్ తండ్రి శ్యాంబాబు వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా, అతనిపైనా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అనంతరం నిందితులు పారిపోగా స్థానికులు వీరిని చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శ్యాంబాబు పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘర్షణలో చంద్రశేఖర్ చేయికి గాయమైంది. బాధితుడు పవన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంకిపాటి సుధాకర్, కంకిపాటి చంద్రశేఖర్, కంకిపాటి జయకర్, కంకిపాటి విజయలక్ష్మి, కొమ్మర వెంకటేశ్వరరావు, కొమ్మర మరియమ్మలపై తణుకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనా స్థలాన్ని తణుకు రూరల్ సీఐ సీహెచ్ ఆంజనేయులు, ఎస్సై కె.గురయ్య పరిశీలించి వివరాలు సేకరించారు.

గడపగడపకు సంక్షేమం



పెనుగొండ (ఆచంట): ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు బ్రోచర్ అందిస్తూ ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

రేపు విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను పరిష్కరించే నిమిత్తం శుక్రవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు సీజీఆర్ఎఫ్ చైర్మన్ బి.సత్యనారాయణ, ఏలూరు ఈఈ టీ.శశిధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరులోని విద్యుత్ భవన్‌లో ఉదయం 10. 30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, హెచ్చుతగ్గులు, బిల్లుల్లో సమస్యలు, కొత్త సర్వీసుల మంజూరులో జాప్యం, బిల్లులో పేరు మార్పిడి, సరఫరా పునరుద్ధరణలో ఇబ్బందులు, నియంత్రికల మార్పిడి వంటి అంశాల్లో సమస్యలు ఉంటే ఈ వేదికలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక చైర్మన్‌తో పాటు సభ్యులు హరిబాబు, పి. శ్రీనివాస్, బాలాజీ ప్రసాద్ పాండే పాల్గొంటారని పేర్కొన్నారు.

అత్యాచార యత్నంపై డీఎస్పీ విచారణ

ఆకివీడు: పట్టణంలోని ఓ బాలికపై అత్యాచార యత్నం ఘటనకు సంబంధించి భీమవరం డీఎస్పీ శ్రీధర్ బుధవారం విచారణ నిర్వహించారు. బాలికను మార్కెట్ యార్డు ప్రాంతంలోకి ఎలా తీసుకువచ్చారు, ఎవరు గుర్తించారు, బాలిక పరిస్థితి ఎలా ఉందనే వివరాల్ని డీఎస్పీ అడిగి తెలుసుకున్నారు. బాధితురాలి తల్లి, బంధువులు, ఉపాధ్యాయులు, ఏఎంసీలోని సిబ్బంది, కొంత మంది యువకుల్ని సంఘటనపై ఆరా తీశారు. సంఘటనపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేసినట్లు డీఎస్పీ శ్రీధర్ చెప్పారు. విచారణలో ఎస్సై కే.రాజారెడ్డి పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల తీర్చడమే సీఎం లక్ష్యం



తణుకు జగనన్న కాలనీలో రిబ్బన్ కట్‌చేసి గృహప్రవేశం చేస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు అర్బన్: పేదల సొంతింటి కల నిజం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తణుకు 7వ వార్డులోని జగనన్న కాలనీలో షేక్ బాషు, హజారా బేగం దంపతులు కొత్తగా నిర్మించుకున్న ఇంటిని మంత్రి కారుమూరి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో నివాసితుల సౌకర్యార్థం అన్ని వసతులు కలిస్తున్నట్లు చెప్పారు. రహదారులు, విద్యుత్, తాగునీటి సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. ఇళ్లు మంజూరైన ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుని జగనన్న కాలనీలో ఉండాలని సూచించారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, షేక్ బాజీ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాల కార్యక్రమంలో మాట్లాడుతున్న రవికుమార్

సాక్షి, భీమవరం: రాష్ట్రాన్ని డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు యువత నడుం బిగించాలని ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ ఏటీవీ రవికుమార్ అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల యువత జీవితాలు అంధకారమవుతాయన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు విద్యార్థులు తమ దృష్టికి వచ్చిన అంశాలను తమకు తెలియజేయాలని కోరారు. దేశ ఆర్థిక వ్యవస్థకు డ్రగ్స్ మాఫియా ప్రమాదకరంగా మారిందని, ప్రధానంగా డ్రగ్స్ విక్రయదారులు కళాశాలలపై ఎక్కువగా దృష్టి పెట్టారని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌ను అరికట్టడానికి ఎస్ఈబీ ప్రత్యేకంగా జిల్లాలో 40 కళాశాలలను ఎంపిక చేసి విద్యార్థులను చైతన్యం చేసేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు రవికుమార్ చెప్పారు. జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ పి.భార్గవ మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు అలవాటు పడ్డ విద్యార్థులు త్వరితగతిన శక్తిని కోల్పోయి నిర్వీర్యంగా తయారవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలల కాలంలో డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలనే ఆదేశాలకు అనుగుణంగా విస్తృతంగా విద్యార్థి చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సెబ్ సీఐ వర్మ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం నేరమని, డ్రగ్స్ వినియోగించినా, విక్రయాలు చేసినా కఠిన శిక్షలు తప్పవని హెచ్చరించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.జగపతిరాజు, వి.చంద్రశేఖర్, డాక్టర్ అరుణకుమారి, ప్రొఫెసర్ పద్మారావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థులకు బస్‌పాస్‌లు



ఇరగవరంలో విద్యార్థులకు బస్ పాస్‌లు అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: మండలంలోని బుధవారం దివ్యాంగుల శిక్షణ కేంద్రంలో 30 దివ్యాంగులకు బస్ పాస్‌లు అందించడం జరిగిందని తణుకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ లాల్ తెలిపారు. ఏలేటిపాడు సొసైటీ అధ్యక్షుడు సత్తి బాబు ఆర్థిక సహాయంతో పాస్‌లు అందించడం జరిగిందన్నారు. దాతలు అందిస్తున్నా సాయం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్ర భవిత దివ్యాంగుల శిక్షణ ప్రత్యేక అధికారి గాలేశ్వరరావు, సత్తి బాబు, ఎ జగదీష్ విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

గూడెం మండలంలో 95 శాతం ఈ-కేవైసీ పూర్తి



జగన్నాథపురం ఆర్‌బీకేలో ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో 95 శాతం ఈ–కేవైసీ నమోదు పూర్తైందని మండల వ్యవసాయాధికారి ఆర్‌ఎస్.ప్రసాద్ తెలిపారు. బుధవారం మండలంలోని పట్టింపాలెం, వీరంపాలెం, జగన్నాథపురం గ్రామాల్లోని ఆర్‌బీకేల్లో జరుగుతున్న ఈ-కేవైసీ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ నూరు శాతం ఈ–క్రాప్ తాడేపల్లిగూడెం మండలంలో పూర్తైందన్నారు. ఈ–కేవైసీ పూర్తైతేనే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 25వ తేదీ వరకు గడువు ఉండటంతో రైతులు త్వరితగతిన వేలిముద్రలు వేయాలని సూచించారు. ఆయన వెంట వీఏఏలు మరిడి దుర్గ, డి.ప్రవీణ్, రైతులు ఉన్నారు.

రేలంగి మాజీ సర్పంచ్ మృతి



మాజీ సర్పంచ్ పెన్మత్స నరసింహరాజు

ఇరగవరం: మండలంలో రేలంగి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, మాజీ సర్పంచ్ పెన్మత్స నరసింహరాజు (80) బుధవారం హైదరాబాద్ మృతి చెందడం జరిగింది. ఆయన గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు దీంతో హైదరాబాద్‌లో ఉండి చికిత్స పొందుతూ బుధవారం తుది శ్వాస విడిచారు. ఆయన పార్థివ దేహాన్ని స్వగ్రామం తీసుకు రావడం జరిగింది. పెద్ద ఎత్తున గ్రామస్తులు, నాయకులు నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామా అధ్యక్షుడు పులుపు అనిల్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, నాయకులు, పులుపు శ్రీను, పులుపు సునీల్, చేబ్రోలు పెద్దిరాజు, వద్దే మార్కండేయులు, మాజీ సర్పంచ్ మైనం పాము, నాయకులు అభిమానులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నడివీధికి వచ్చిన ఏవులమ్మ తల్లి



తణుకు సజ్జాపురంలో గ్రామ దేవత గరగలను నడి వీధికి తీసుకువస్తున్న భక్తులు


తణుకు అర్బన్: తణుకు సజ్జాపుర వాసుల ఇలవేలుపు ఏవులమ్మ తల్లి జాతర మహోత్సవం సందడి ప్రారంభమైంది. అమ్మవారిని నడివీధికి తీసుకువచ్చే ఘట్టాన్ని సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయంలోని అమ్మవారి గరగలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూరిపాకలోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో తీన్‌మార్ డప్పులు, బాణాసంచా కాల్పుల మధ్య దారిపొడవునా మహిళలు వస్త్రాలు పరుస్తూ నీరు చిమ్ముతూ అమ్మవారిని నడి వీధికి స్వాగతించారు. వచ్చేనెల 12 నుంచి 14వ తేదీ వరకు జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు జాతర కమిటీ తెలిపారు. సజ్జాపురవాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

గ్రహణం మొర్రికి ఉచిత శస్త్ర చికిత్సలు

సాక్షి, భీమవరం : గ్రహణం మొర్రి ఉన్న వారికి హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ ఆసుపత్రి వైద్యుల సహకారంతో ఉచితంగా శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ శ్యాం సుందర్ బుధవారం తెలిపారు. భీమవరంలోని ఏఆర్‌కేఆర్ మున్సిపల్ పాఠశాల ఆవరణలో మార్చి 1వ తేదిన వైద్య శిబిరం నిర్వహిస్తామని, 6 నెలల నుంచి 50 ఏళ్ల వయస్సు ఉన్నవారు హాజరు కావచ్చన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైనా వారికి రవాణా సదుపాయాలు ఉచితంగానే కల్పిస్తారని పేర్కొన్నారు.

ముందు జాగ్రత్తే శ్రీరామరక్ష

- గ్రామాల్లో కనిపిస్తున్న ఆటలమ్మ, గవద బిళ్లల కేసులు
- పిల్లల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు



ఆటలమ్మ సోకిన దృశ్యం

అత్తిలి: వేసవికాలం ప్రారంభమైతే చాలు చికెన్ పాక్స్(ఆటలమ్మ), గవద బిళ్లల సమస్య పిల్లల్లో అధికంగా కనిపిస్తుంది. మార్చి నెలలోకి అడుగు పెట్టకముందే ఎండలు మండుతున్నాయి. మరో వైపు ఇప్పటికే గ్రామాల్లో చికెన్ పాక్స్, గవద బిళ్లల సమస్య కనిపిస్తోంది. వీటి బారిన పడిన వారికి జలుబు, జ్వరం, శరీరంపై పొక్కులు, దవడలకు ఇరువైపులా బిళ్లలు, నొప్పి వంటి సమస్యలు తీవ్రంగా బాధిస్తాయి. అన్ని వయసుల వారికి ఈ అంటు వ్యాదులు సోకి అవకాశమున్నా ప్రధానంగా చిన్నారులకు ఎక్కువ ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. అందుకే ముందు జాగ్రత్తలతోనే అంటువ్యాదుల బారిన పడకుండా చూసుకోవచ్చని సూచిస్తున్నారు. పదేళ్లలోపు చిన్నారులకు ఈ వ్యాధి వస్తుంది. వారి విషయంలో మరింత శ్రద్ధ చూపాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సాధారణంగా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఆటలమ్మ, గవద బిళ్లలు సోకిన వారు త్రీవ అసౌకర్యానికి గురవుతారు. ఆకలి లేకపోవడం, ఆహారం సరిగా తీసుకోలేక తీవ్రంగా నిరసించిపోతారు. శరీరంపై నీటి పొక్కులు, జ్వరం వంటి లక్షణాలు కనిపించగానే ఆటలమ్మగా గుర్తించి వైద్యులను సంప్రదించాలి. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యుల సూచన మేరకు యాంటీవైరల్, యాంటీ బయోటిక్ మందులు వాడాల్సి ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

ఆటలమ్మ సోకినవారిని మిగతా వారికి దూరంగా ఉంచాలి. వారికి తేలికగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలే ఇవ్వడం మంచిది. గవద బిళ్లలు వచ్చినవారికి గొంతునొప్పి తీవ్రంగా ఉంటుంది. నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. తరచూ ద్రవ పదార్థాలను ఆహారంగా తీసుకోవాలి. చికెన్ పాక్స్, గవద బిళ్లలు వచ్చిన వారి విషయంలో ప్రజలు అపోహాలు, మూడ నమ్మకాలతో వైద్య సహాయం తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తుంటారని, అది మంచిది కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే మెదడు, ఊపిరితిత్తులపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంటుందంటున్నారు. ఇలాంటి వ్యాధులు సోకకుండా ఉండేందుకు పిల్లలకు గోరు వెచ్చని నీరు, శుభ్రమైన ఆహారం ఇవ్వడంతో పాటు పరిసరాల్ని పరిశుభ్రంగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యులను సంప్రదించాలి



ఆటలమ్మ, గవదబిళ్లల వ్యాధులపై నిర్లక్ష్యం తగదు. ప్రస్తుతం చిన్న పిల్లలు ఎక్కువగా ఈ సమస్యతో బాధపడుతున్నారు. ఈ వ్యాధి లక్షణాలు కనిపించగానే వెంటనే వైద్యులను సంప్రదించి వారి సూచనల మేరకు మందులు వాడాలి

– డా.కె.నాగరాజు అత్తిలి పీహెచ్‌సీ వైద్యుడు

శ్రీశ్రీ రచనలు సమాజానికి మార్గదర్శకం

తాడేపల్లిగూడెం అర్బన్ : శ్రీరంగం శ్రీనివాస్ (శ్రీశ్రీ) రచనలు, కవిత్వం నేటి సమాజానికి ఆదర్శనీయమని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. రెడ్ బుక్ డే కార్యక్రమాన్ని స్థానిక కిరాణా వర్తక సంఘం భవనంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ శ్రీశ్రీ రచనలను, కవిత్వాలను నేటి యువత అవగతం చేసుకోవాలన్నారు. నేటి సమాజానికి అవసరమైన విషయాలను ఆనాటి కాలంలోనే రచనల ద్వారా శ్రీశ్రీ వెల్లడించారన్నారు. కర్రి నాగేశ్వరరావు, శివప్రసాద్, వెంకన్న, కరెడ్ల రామకృష్ణ, రౌతు వెంకట నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈకేవైసీ తప్పక చేయించుకోవాలి

పెంటపాడు: ఈనెల 25 లోపు రైతులు తప్పక ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి కె. పార్థసారథి పేర్కొన్నారు. ఆకుతీగపాడు క్లస్టర్ పొలంబడిలో భాగంగా రైతులకు ప్రత్యేక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంట నమోదుకు సంబంధించి ఈకేవైసీ తప్పక చేయించుకోవాలన్నారు. పంటకు సంబంధించి ధాన్యం సొమ్ములు సకాలంలో పడేందుకు వీలుగా ఈకేవైసీని రైతులు చేయించుకోవాలన్నారు.

రవీంద్రనాథ్ నామినేషన్‌కు తరలిన పార్టీ శ్రేణులు



ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్‌ను అభినందిస్తున్న మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు

తణుకు టౌన్: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన రాష్ట్ర ఎంఎస్ఎఈ చైర్మన్ వంక రవీంద్రనాథ్ తన ఎన్నికల నామినేషన్ దాఖలు చేసేందుకు తణుకు నియోకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో తరలివెళ్లారు. బుధవారం సజ్జాపురంలోని ఎమ్మెల్సీ అభ్యర్థి వంక రవీంద్రనాథ్ తన నివాసం నుంచి మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు నివాసానికి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి రవీంద్రనాథ్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. అక్కడ నుంచి ర్యాలీగా తణుకులోని వరసిద్ధి వినాయకుని గుడిలో మంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ నుంచి ర్యాలీగా రాష్ట్రపతి రోడ్డులో ర్యాలీగా వెంకటేశ్వర స్వామి ఆలయం వద్దకు వెళ్లి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అక్కడ నుంచి మున్సిపల్ కార్యాలయం వరకూ వెళ్లి అక్కడ నుంచి రాష్ట్రపతి రోడ్డు మీదుగా పైడిపర్రు నుంచి తేతలి, దువ్వ గ్రామాల్లోని కార్యకర్తలతో ఏలూరులో నామినేషన్ కార్యక్రమానికి తరలివెళ్లారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వంక రాజకుమారి, తణుకు ఎంపీపీ రుద్ర ధనరాజు, ఇరగవరం, అత్తిలి, పెనుగొండ జెడ్పీటీసీలు పంపన అంజిబాబు, అడ్డాల జానకి, కె గోవర్ధన, పెనుగొండ పీ వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, దువ్వ గ్రామ సర్పంచ్ అడ్డా బాబు, మండల రైతు అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ సభ్యు లు, సర్పంచ్‌లు, లయన్స్ క్లబ్ నాయకులు, గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

జగనన్న తోడు లబ్ధిదారులను గుర్తించాలి



సమావేశ మందిరంలో మాట్లాడుతున్న ఎల్‌డీఎం రమణ, పాల్గొన్న అధికారులు, బ్యాంకు సిబ్బంది

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న తోడు లబ్ధిదారులను గుర్తించాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ఎస్‌వీవీ.రమణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో తాడేపల్లిగూడెం పట్టణ, రూరల్, పెంటపాడు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎం రమణ మాట్లాడుతూ టిడ్కో ఇళ్ల డాక్యుమెంటేషన్, ఇతరత్ర పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జగనన్న తోడుకు అర్హత కలిగిన అభ్యర్థుల గుర్తింపు, రుణ రీ–షెడ్యూల్ వంటి పనులు వారంలోగా చేపట్టాలన్నారు. బ్యాంకర్లు, అధికారుల మధ్య ఏమైనా ఇబ్బందులుంటే తమ దృష్టికి తేవాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో డివిఎన్.వేణుగోపాల్, వెలుగు ఏపీఎం జీవీకే డీఎం.లక్ష్మి, మండల వ్యవసాయాధి కారి ఆర్‌ఎస్.ప్రసాద్, ఆంధ్రాబ్యాంకు మేనేజర్ డివి.ప్రసాద్, మెప్మా, బ్యాంకుసిబ్బంది పాల్గొన్నారు.

నర్సింహమూర్తి సేవలు చిరస్మరణీయం

తాడేపల్లిగూడెం అర్బన్: స్వర్గీయ ఆకాశపు నర్సింహమూర్తి టైలర్ల సంఘానికి చేసిన సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. నర్సింహమూర్తి 125వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆకాశపు స్వామి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో టైలర్ల సంఘాలన్నిటినీ ఒకే తాటిపైకి తీసువచ్చి ఆంధ్ర టైలర్ల సంఘంను స్థాపించిన ఘనత నర్సింహమూర్తిదని గుర్తు చేశారు. టైలర్లకు సంక్షేమాన్ని అందించేందుకు కేరళ, తమిళనాడు తదితర రాష్ట్రాలను సందర్శించి అప్రాంతాల్లోని టైలర్లకు ప్రభుత్వాల ద్వారా అందుతున్న సంక్షేమం మాదిరిగా ఆంధ్రలోని టైలర్లకు అందించేందుకు కృషి చేశారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. ఈ కార్యక్రమంలో బాదంశెట్టి శివసత్యనారాయణ, కొమ్మర రమణ, బేతా మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

పార్వతీ రామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం



తాడేపల్లిగూడెం పట్టణంలో శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని వానపల్లి గూడెం చెరువు గట్టున వేంచేసియున్న పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి పుర మహోత్సవం బుధవారం సాయంత్రం అత్యంత వైభవంగా జరిగింది. మహాశివరాత్రి ఉత్సవాలు ముగింపు సందర్భంగా ఉదయం స్వామివారికి నిత్య పూజలతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. వానపల్లిగూడెం, వీకర్స్ కాలనీ, గాంధీ బొమ్మ సెంటర్, టీటీడీ కల్యాణ మండపం, మహాలక్ష్మీనగర్ మీదుగా డీఎస్ చెరువు మీదుగా శేషమహల్ రోడ్డు నుంచి మెయిన్ రోడ్డులో ఊరేగింపు సాగింది. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లకు పట్టణ ప్రజలు సాదర స్వాగతం పలికి పండ్లు, టెంకాయలు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఆలయ కమిటి సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భీమవరంలో మానవత ఏర్పాటుకు సన్నాహాలు

సాక్షి, భీమవరం : పట్టణంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటుకు సన్నాహక సమావేశం త్యాగరాజు భవనంలో నిర్వహించారు. సంస్థ విస్తరణాభివృద్ధి కమిటీ రాష్ట్ర కన్వీనర్ సాగిరాజు జానకిరామరాజు, సంస్థ జిల్లా అధ్యక్షుడు రామిశెట్టి గంగాధరరావు మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో అనేక చోట్ల రక్తదాన శిబిరాలు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటడం, ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, భీమవరంలో కూడా కార్యకలాపాలు చేపట్టనున్నట్లు చెప్పారు. మునలయ్య రూ.70 వేలు విలువ చేసే ఫ్రీజర్‌ను బహుకరిస్తున్నట్లు ప్రకటించారు.

తాగునీటిపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

ఇరగవరం: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి వనరులపై దృష్టి పెట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాస్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో క్రాష్ ప్రోగ్రాం పై సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రక్షిత మంచి నీటి పథకాలను ఇంజనీరింగ్ అసిస్టెంట్లు నిత్యం పర్యవేక్షించి లోపాలను సవరించాలన్నారు. ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా చూడాలని సూచించారు. గ్రామాల్లో నీటి ఎద్దడికి ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా గ్రామాల్లో సిబ్బంది 23 వ తేదిన పిడబ్ల్యూ ఎస్ ట్యాంక్ లు పరిశీలించి లోపాలను గుర్తించి ఆన్‌లైన్ ద్వారా నమోదు చేయాలన్నారు. 24వ తేదీ నుంచి మార్చి 2 వ తేది వరకు లోపాలు సవరించాలన్నారు. ఎంపీడీవో కృష్ణ మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ రమేష్, ఉన్నారు.

పెంటపాడులో స్వచ్ఛసంకల్పం



జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో భాగంగా రోడ్డు ఊడ్చుతున్న సర్పంచ్, ఇతర ప్రజాప్రతినిదులు

పెంటపాడు: ప్రజలు వ్యక్తిగత ఆరోగ్యం, ఇంటి శుభ్రతతో పాటు పరిసరాల శుభ్రతకు కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. పెంటపాడు గ్రామంలో జగనన్న స్వచ్ఛసంకల్పం కార్యక్రమంలో భాగంగా మంగళ, బుధవారాల్లో పలు వార్డులోని చెత్తను ఊడ్చారు. డ్రైనేజీలు శుభ్రపరిచారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు పలు ప్రాంతాల్లోని చెత్తను తొలగించి, రోడ్లు ఊడ్చారు. తాగునీటిపై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలను తెలుసుకొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న ఆశయాలకు అనుగుణంగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణల సూచనల మేరకు వారంలో రెండు రోజులు ఈ కార్యక్రమం నిరంతరాయంగా చేయనున్నట్లు ఆమె తెలిపారు. వార్డు సభ్యులు, పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు విధిగా పాల్గొనాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అనంతరం సర్పంచ్ గా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ, కార్యదర్శి అనిల్‌కుమార్, ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, వార్డు సభ్యులను పలువురు అభినందించి కేక్ కట్ చేశారు. పాలకవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ సూర్యకళ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించేందుకు పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వీధులలో చెత్త వేయకుండా రిక్షాలకు అందించి, డ్రైనేజీలు కలుషితం కాకండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, మండల వ్యవసాయకమిటీ డైరెక్టర్ నల్లమిల్లి విజయానందరెడ్డి, యూత్ అధ్యక్షులు కొవ్వూరి విజయబాస్కరరెడ్డి, ఎంపీటీ సీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల నాగమణి బాబి, వార్డు సభ్యురాలు విప్పర్తి లక్ష్మి, కాసారపు శ్రీను, బర్ల జయరాంబాబు, చదలవాడ శ్రీనివాస్, కొలుపూరి శివ, దేవాబత్తుల వెంకన్నబాబు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

పైడిపర్రు హైస్కూలులో విద్యార్థుల ఆందోళన



విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో శ్రీనివాసరావు

తణుకు: ఉపాధ్యాయుల మధ్య తలెత్తిన విభేధాలు విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనకు దారితీశాయి. తణుకు మండలం పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు బైటాయించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్ మధ్య గతం నుంచి మనస్పర్థలు ఉన్నాయి. ఈ క్రమంలో ఇటీవల ఒక విద్యార్థినికి ప్రధానోపాధ్యాయులు ప్రేమలేఖ రాశారంటూ ఆరోపణలు వచ్చాయి. దీనికి బలం చేకూరేలా కొందరు విద్యార్థులు ఈనెల 19న రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ప్రధానోపాధ్యాయులు వెంకటరమణను పోలీసులు విచారణ చేశారు. దీంతో వ్యాయామ ఉపాధ్యాయులు ప్రసాద్‌పై ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో బుధవారం విద్యార్థులు, తల్లిదండ్రులు కలిసి పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. ఎంఈఓ ఎస్.శ్రీనివాసరావు పాఠశాలకు చేరుకుని విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమయానికి విద్యార్థులను ఇంటికి పంపడంలేదని, అదనపు తరగతుల పేరుతో పదోతరగతి విద్యార్థులను ఎక్కువ సమయం ఉంచేస్తున్నారని, ఉదయం ఆలస్యం అయితే అనుమతించడం లేదని తల్లిదండ్రులు ఎంఈవో వద్ద ఆరోపించారు. దీనిపై ఎంఈవో శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని చెప్పారు.

మూడు గ్రామాలకు కొత్త ఇన్‌చార్జి కార్యదర్శులు

తణుకు టౌన్: మండలంలోని దువ్వ, ముద్దాపురం, వేల్పూరు గ్రామాలకు ఇన్‌చార్జి కార్యదర్శులను కలెక్టర్ నియమించారు. ఈమేరకు బుదవారం ఆయా గ్రామ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. తణుకు మండలంలోని వేల్పూరు గ్రామ కార్యదర్శిగా వేల్పూరు 3 సచివాలయ కార్యదర్శి కేవీవీ రాజును, ముద్దాపురం గ్రామ కార్యదర్శిగా తేతలి 2 సచివాలయ కార్య దర్శి ఎం డాక్టర్ బాబును, దువ్వ గ్రామ కార్యదర్శిగా మండపాక 2 సచివాలయ కార్యదర్శి కె సూర్య మణికంఠలను నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అయితే ఈ గ్రామాలకు సంబంధించిన పారిశుద్ధ్య, జీతాల బిల్లుల, ట్రెజరీ వ్యవహారాలన్నీ గతంలో ఇన్‌చార్జి గ్రామ కార్యదర్శులుగా పని చేసిన గ్రేడ్ 1 కార్యదర్శుల పర్యవేక్షణలోనే జరుగుతాయని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

దిరుసుమర్రులో అన్నసమారాధన

భీమవరం అర్బన్ : మండలంలోని దిరుసుమర్రు గ్రామంలో కొలువైయున్న స్వయంభూ గంగా భ్రమరాంభ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆఖరిరోజు బుధవారం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ముందుగా రామలింగేశ్వరస్వామివారికి పంచామృత అభిషేకాలు, గోక్షీరాభిషేకం, సహస్ర నామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ వంటకాలతో సుమారు 6 వేల మందికి అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ అల్లూరి బంగార్రాజు, సభ్యులు కలిదిండి పేర్రాజు, మైగాపుల గంగారామ్, కె.సూర్యనారాయణరాజు, యాళ్ళ బాబులు, గవరపు రాజబాబు, త్రిమూర్తులు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆకుతీగపాడులో పొలంబడి



పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

పెంటపాడు: వరిపైరు చిరుపొట్ట దశలో సస్య రక్షణ చర్యలు ఎంతో అవసరమని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మండలంలోని ఆకుతీగపాడు గ్రామంలో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏవో ముఖ్యఅతిధిగా హాజరై రైతులకు అవగాహన కల్పించారు. వరిపైరు చిరుపొట్ట దశలో ఉన్న కారణంగా ఎకరాకు 25 కేజీల పొటాష్, 45 కేజీల యూరియా వేసుకోవాలని సూచించారు. అదే విధంగా చిరుపొట్ట దశలో ఉన్న వరిపైరుకు దోమ అత్యధికంగా సోకే ప్రమాదం ఉందన్నారు. గూడెం వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ మాట్లాడుతూ సేంద్రీయ పద్ధతిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగులను నివారించుకోవాలన్నారు. ఏవో సారధి మాట్లాడుతూ అగ్నేయాస్త్రం, దాని తయారీపై అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయసలహామండలి అధ్యక్షుడు కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం చేసుకోవాలని, మిత్రపురుగులను రక్షించుకొంటూ పంటకు హానీ చేసే తెగుళ్లను నిర్మూలించుకోవాలన్నారు. పెంటపాడు మండలంలో క్లస్టర్ గ్రామంగా ఉన్న ఆకుతీగపాడు రైతులు శాస్త్రవేత్తల సూచనలు, వ్యవసాయాధికారుల సూచనలు పాటిస్తూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా సాధించాలనే విషయంపై ఆశక్తిని పెంచుకొని పలువురికి అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఫణికుమార్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు కొణతాల వెంకట్రావు, జాలపర్తి నాగేశ్వరరావు, ఆకుల శ్రీనివాస్, వీరన్న, చింతల నాగరాజు,వ్యవసాయశాఖ వీఏఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.